తొలితరం స్వాతంత్య్ర యోధుడు 'బాపినీడు'


కడప కల్చరల్ : తొలితరం స్వాతంత్య్ర సమరయోధుడిగా మాగంటి బాపినీడుకు గొప్ప పేరుందని, ఆయన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని యేడాదిపాటు శిక్షను అనుభవించారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సోమవారం మాగంటి బాపినీడు, భార్గవీరావుల జయంతిని నిర్వహించారు. ఆచార్య రాంప్రసాద్‌రెడ్డి , బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ బాపినీడు ఆచార్య ఎన్జీ రంగతో కలిసి కిసాన్ ఉద్యమం ప్రారంభించారని, ఆంధ్ర రైతు సభ తొలి కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. భార్గవీరావు రచనలను ప్రస్తావించారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఇంటాక్ కొశ్చనీర్ బుక్ విడుదల


కడప కల్చరల్ : ఇంటాక్ కడప చాప్టర్ రూపొందించిన విద్యార్థుల కొశ్చనీర్ బుక్‌ను సోమవారం పాత కలెక్టరేట్‌లోని సంస్థ కార్యాలయంలో బీసీ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య విడుదల చేశారు. సంస్థ చాప్టర్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి , గునిశెట్టి శ్రీనివాసులు, పద్మప్రియ చంద్రారెడ్డి, గౌరీశంకర్, జనార్దన్‌రాజు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పుస్తక ప్రచురణ కర్త లయన్ పాలాది రమేష్‌ను, సహకరించిన గునిశెట్టి శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు.











సెంచరీ కొట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం'

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కడప నియోజకవర్గంలో వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక 27వ డివిజన్ గౌస్ నగర్‌లో కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ జహీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి, పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ తు.చ తప్పకుండా అమలు చేసి చూపించారన్నారు. 98 శాతం హామీలు అమలు చేసి, అందులో ఇంకా ఎవరైనా అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదా తెలుసుకోవడానికి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ కార్యక్రమం కడపలో వంద రోజులు పూర్తి చేసుకోవడం సంతోషదాయకమన్నారు. కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, అధికారుల వల్లే ఇన్ని రోజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగలిగామన్నారు. ఈ సందర్భంగా ఎంతోమంది సమస్యలను పరిష్కరించగలిగామని, మరికొంత మంది అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, హాఫీజుల్లా, పాకా సురేష్ కుమార్, సానపురెడ్డి శివకోటిరెడ్డి, బండి ప్రసాద్, పవర్ అల్తాఫ్, సీహెచ్ వినోద్ కుమార్, దేవిరెడ్డి ఆదిత్య, దాసరి శివప్రసాద్, షఫీవుల్లా, షఫీ, మహిళా నేతలు మూలే సరస్వతి, టీపీ వెంకట సుబ్బమ్మ, సుశీలమ్మ, పద్మ, విజయకుమారి పాల్గొన్నారు.


'గడప గడపకు మన ప్రభుత్వం' వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు కేక్ తినిపిస్తున్న అఫ్జల్‌ఖాన్ తదితరులు

అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ పథకాల అమలు

అర్హతే ప్రాతిపదికగా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 27వ డివిజన్ గౌస్ నగర్, గంజికుంట కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలిగిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా .. అని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు


వైవీయూ: కడప ఆర్ట్స్ కళాశాలలో సాంస్కృతిక పోటీల విజేతలతో అతిథులు


కడప ఎడ్యుకేషన్: జాతీయ జెండాతో మను పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది


కడప కోటిరెడ్డిసర్కిల్ : అమర వీరుల సేవలను కొనియాడుతున్న బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్

వైవీయూ : కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, కళాశాల ఎన్‌ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కూచిపూడి, భరతనాట్యం, పాటలు, వెస్ట్రన్ డాన్స్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి , ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ చిన్నపరెడ్డి , కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ సమరయోధుల స్ఫూర్తితో నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం .రమేష్, గండికోట రాజవంశీయులు ప్రభాకర్‌నాయుడు, లయన్స్‌క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. వైసావిత్రి, అధ్యాపకులు డా. కల్పన, నాగరాజు పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.

మనులో ఘనంగా హర్ ఘర్ తిరంగా

కడప ఎడ్యుకేషన్ : మను పాలిటెక్నిక్ ఉర్దూ యూనివర్సిటీలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాను చూసినప్పుడు దేశం కోసం మనం చేయాల్సిన కర్తవ్యం, బాధ్యత, త్యాగం గుర్తుకు రావాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మెహమ్మద్ సికిందర్ అన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో ..

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సోమవారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పోతుల వెంకట్రామిరెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు పాత బస్టాండు వద్దగల సంస్థ కార్యాలయంలో దాదాపు 200 మందికి ఖద్దరు త్రివర్ణ పతాకాలను అందజేశారు. పోతుల వెంకట్రామిరెడ్డి , గండికోట అభివృద్ధి వారసత్వ ప్రాధికార సంస్థ ఛైర్మన్ పెమ్మసాని ప్రభాకర్‌నాయుడు, లయన్స్ క్లబ్ కార్యదర్శి జనార్దన్‌రాజు మాట్లాడారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి మధుమోహన్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ రంగనాథరెడ్డి, న్యాయవాది భారవి, గొబ్బూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు స్ఫూర్తిదాయకం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశం కోసం తమ ప్రాణాలు అర్పించిన అమర వీరుల సేవలు స్ఫూర్తిదాయకమని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని గురుకుల్ విద్యాపీఠ్‌లో విద్యార్థులతో కలిసి అమర వీరులకు నివాళులర్పించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన విజయ్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించింది. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని ఆ పార్టీ కార్యకర్తలు జేసీ చాంబర్ ఎదుట బైఠాయించారు. పార్టీలకు అతీతంగా అర్హులకు భూమి పట్టా ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. విలువైన గుట్ట, వంక, వాగు, చెరువు, రస్తా, పోరంబోకు, దేవాదాయ, ఇనాం, అసైన్‌మెంట్ భూములు అక్రమార్కుల కబ్జాలో ఉన్నాయని, తహసీల్దార్లు వారికి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు రామయ్య, ఆంజనేయులు, వెంకట శివ, వేణుగోపాల్, కేసీ బాదుల్లా, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన

కడప సెవెన్‌రోడ్స్ : జగనన్న క్లాప్ మిత్రలకు రావాల్సిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, అధ్యక్షులు వేణుగోపాల్, కేసీ బాదుల్లాలు మాట్లాడారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

'మేరీ మట్టి.. మేరీ దేశ్' శిలాఫలకం ఆవిష్కరణ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని సీవీ రామన్ సైన్స్‌బ్లాక్ ఆవరణంలో 'మేరీ మట్టి.. మేరీ దేశ్' శిలాఫలకంను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆవిష్కరించారు. సోమవారం విశ్వవిద్యాలయంలో 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్ 75 సంవత్సరాలకు గుర్తుగా 'నా మట్టి.. నా దేశం' నినాదంతో 'వసుధకు వందనం - వీరులకు వందనం' పేరుతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మనం జీవించే ప్రతి క్షణం ప్రతిరోజూ ప్రతిశ్వాసలో మాతృభూమికి అంకితభావంతో మనం ఉండటమే స్వాతంత్య్ర వీరులకు మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఈ శిలాఫలకం ఏర్పాటుకు సూర్య చారిటబుల్ ఎన్ఆర్ఐ ట్రస్ట్ వ్యవస్థాపకులు గోర్ల సూర్యనారాయణ, సంస్థ ఛైర్మన్‌ప్రభాకర్ సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, ఆచార్య ఎ. మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

అర్చక సమాఖ్య అధ్యక్షునికి పురస్కారం

కడప కల్చరల్ : రాష్ట్ర అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షులు, వేద పండితులు విజయ్‌భట్టర్‌కు మొల్ల సాహితీ ఆధ్యాత్మిక సేవా పురస్కారాన్ని అందజేశారు. మొల్ల సాహితీ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు సోమవారం తన కార్యాలయంలో ఈ పురస్కారాన్ని విజయ్‌భట్టర్‌కు అందజేశారు. దేవాలయాలలో మొల్లమాంబ రచనల ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ఈ పురస్కారాన్ని అందజేశారు.

18న రాష్ట్రస్థాయి ఉక్కుసదస్సు

వైవీయూ : కడప నగరంలో యూటీఎఫ్ భవన్‌లో ఈనెల 18వ తేదీ నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఉక్కు సదస్సును విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం వైవీయూలో ఉక్కు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ముత్యం, సింహాద్రి, హుస్సేన్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలకు పరిష్కారం చూపాలి

కడప కార్పొరేషన్: 'స్పందన' అర్జీలకు శాశ్విత పరిష్కారం చూపాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్ సూచించారు. సోమవారం కడప నగరపాలక సంస్థ వీసీ హాలులో నిర్వహించిన 'స్పందన ' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 47 అర్జీలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి-21, ఇంజినీరింగ్ విభాగం-9, హెల్త్ విభాగం-7, రెవెన్యూ విభాగం-2, ఎస్టాబ్లిష్‌మెంట్-1, యూపీఏ విభాగం-1, కడప తహసీల్దార్ కార్యాలయం-2, సీకే దిన్నె తహసీల్దార్-1, హౌసింగ్-3 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను సమగ్రంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని, సంబంధిత శాఖాధికారులకు కమిషనర్ సూచించారు.


అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

బీజేపీతోనే మైనార్టీల అభివృద్ధి

కడప కోటిరెడ్డి సర్కిల్ : భారతీయ జనతా పార్టీతోనే దేశంలో మైనార్టీల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షులు షేక్ బాజీ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో బీజేపీ మైనార్టీల కోసం అమలుచేస్తున్న పలు పథకాలతో కూడిన బ్రోచర్లను ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మావతిభాయి, జిల్లా అధ్యక్షులు యల్లారెడ్డి, కడప అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కట్టడాలను పరిరక్షించాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ప్రాచీన కట్టడాలను పరిరక్షించాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పి. ఖాదర్‌బాషా కోరారు. సోమవారం ఆయన డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు.















